వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 160
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
మార్చి 21, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## సంకీర్ణ ప్రభుత్వాలతోనే ప్రజలకు రక్షణ

- రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్
- రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కేయూలో జాతీయ సెమినార్

# కూలికెళితే.. ప్రాణం పోయింది



- నర్సింహులపేటలో ఘోర రోడ్డు ప్రమాదం
- కూలీలతో వెళ్తున్న ఆటోను ఢీ కొన్న లారీ
- ఒకరి మృతి, నలుగురి పరిస్థితి విషమం
- మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామ శివారు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొన్న సంఘటనలో చర్లపాలెం గ్రామానికి చెందిన గూడెల్లి అరుణ (38) మృతి చెందగా మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. తొర్రూరు మండలం చర్లపాలెం నుంచి మరిపెడ వైపు మిర్చి ఏరడానికి కూలీలను తీసుకెళ్తున్న ఆటోను పెద్దనాగారం శివారు ఇటుక బట్టీల సమీపంలో గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో ఆటో అదుపుతప్పి పల్టీలు కొడుతూ చెట్ల పొదల్లోకి దూసుకుపోయింది. గాయాలైన వారిని సహచర కూలీలు పోలీసులు, స్థానికుల సహకారంతో మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాద స్థలంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటనకు కారణమై ఆపకుండా వెళ్లిన లారీ ఆచూకీ కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు.

- వరంగల్ వాయిస్, తొర్రూరు



8లో..

# వృక్షో రక్షతి రక్షితః





వివరాలు 2లో..

- మన సంస్కృతిలోనే వృక్ష సంరక్షణ ఉంది
- అడవులను రక్షిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పెస్కోవా
- ఆద్యంతం విద్యార్థులతో కలిసి సందడి

వృక్షో రక్షతి రక్షితః అన్నది మన సంస్కృతి, సంప్రదాయాలతోనే ముడివడి ఉందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ లోని కేబీఆర్ పార్కులో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా తను వృక్షాల సంరక్షణలో భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. చెట్టును మనం కాపాడితే.. అది మనల్ని కాపాడుతుందన్నది జగమెరిగిన సత్యం అన్నారు. అయితే ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పెస్కోవా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆధ్యంతం ఆమె విద్యార్థులతో కలిసి సందడి చేసింది. ఆమెకు పూల బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మొక్కను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా క్రిస్టినాతో ఫొటోలు దిగేందుకు పలువురు ఆసక్తి చూపారు.

– వరంగల్ వాయిస్, వరంగల్





2లో..

## ఎస్‌టీపీల ఏర్పాటుకు స్థలం గుర్తించండి

- నగర మేయర్ గుండు సుధారాణి
- వివిధ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన

## పీహెచ్ సీలో మెరుగైన సేవలు అందించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- ఆకస్మికంగా ఐనవోలు పీహెచ్ సీ తనిఖీ



2లో..




# వృక్షో రక్షతి రక్షితః

- మన సంస్కృతిలోనే వృక్ష సంరక్షణ ఉంది
- అడవులను రక్షిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పెస్కోవా
- ఆద్యంతం విద్యార్థులతో కలిసి సందడి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అడవుల పరిరక్షణ ఆవశ్యకత అందరికీ తెలియాలనే ఉద్దేశ్యంతోపాటు జనంలో మొక్కల పెంపకంపై చైతన్యం తీసుకువచ్చేందుకు మార్చి 21ని ప్రపంచ అటవీ దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అందులో భాగంగానే ప్రతి ఏటా ఈ రోజున ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ లోని కేబీఆర్ పార్కులో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. పర్యావరణ పరిరక్షణ, జీవజాలం మనుగడకు అడవులే ఆధారమని వెల్లడించారు. జీవజాలానికి, వనాలకు విడదీయరాని సంబంధం ఉందని అభిప్రాయపడ్డారు. అడవులను ప్రజలు తమ స్వలాభం కోసం నాశనం చేస్తూ.. తమ ఉనికిని తామే ప్రశ్నార్థకం చేసుకొంటున్నారన్నారు.

**ప్రత్యేక ఆకర్షణగా క్రిస్టినా పెస్కోవా..**

మే 7 వ తేదీ నుంచి 24 రోజుల పాటు తెలంగాణాలో మిస్ వరల్డ్– 2025 పోటీలు జరగనున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 140 దేశాల నుంచి అందగత్తెలు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. మే 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆరంభ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మే 31న హైటెక్స్‌లో మిస్ వరల్డ్ ఫైనల్స్ నిర్వహించనున్నారు. ఈ పోటీల కోసం రూ.54 కోట్లు ఖర్చు కానుంది. ఇందులో ప్రభుత్వశాఖల వాటా రూ.27 కోట్లు కాగా మిస్ వరల్డ్ సంస్థ వాటా రూ.27 కోట్లు ఖర్చు చేయనుంది. అయితే అందాల పోటీల్లో భాగంగా నిర్వహించనున్న సన్నాహక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ జూలియా మోర్లేతోపాటు మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పెస్కోవా హైదరాబాద్ కు విచ్చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. మిస్ వరల్డ్ క్రిస్టినాకు మంత్రి కొండా సురేఖ శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు.

**శాశ్వతమైనది ప్రకృతే..**

ప్రకృతి మాత్రమే శాశ్వతమైనదనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కొండా సురేఖ అన్నారు. మానవ మనుగడకు ఆధారంగా నిలుస్తున్న అడవులను జాగ్రత్తగా కాపాడుకునేలా ఉద్యమించాలన్నారు. ప్రకృతిని సంరక్షిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడంలోనే అర్థవంతమైన జీవితం ఉందన్నారు. అడవుల ప్రాముఖ్యత, అడవులతో మనిషికి ఉన్న అనుబంధం, అడవుల సంరక్షణకు అనుసరించాల్సిన కార్యాచరణను ఈ సందర్భంగా మనమంతా గుర్తు చేసుకోవాలన్నారు. అడవులను సంరక్షించుకోకపోతే తలెత్తే విపత్కర పరిస్థితులను అటవీ దినోత్సవం సందర్భంగా మనమంతా మననం చేసుకోవాలని మంత్రి సురేఖ తెలిపారు.

**పర్యావరణ లోపం..**

పట్టణీకరణ, పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టుల నిర్మాణం, పోడు వ్యవసాయం, గృహాల నిర్మాణం వంటి కారణాలతో అడవులు నానాటికీ అంతరించి పోతున్నాయన్నది మనమంతా ఆవేదన వ్యక్తం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సురేఖా వెల్లడించారు. భూ విస్తీర్ణానికి అనుగుణంగా అడవుల విస్తరణ లేకపోవడంతో గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో కఠిన సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. పర్యావణంలో సమతుల్యత లోపించి విపత్తుల బారిన పడుతున్నామని వెల్లడించారు. వన్య ప్రాణులకు ఆవాసాలైన అడవులను కాపాడుకుంటేనే జీవవైవిధ్యం వర్ధిల్లుతుందన్నారు.

**ప్రజల సహకారం అవసరం..**

ప్రభుత్వం చేపట్టే చర్యలకు ప్రజలు కూడా తమవంతు సహకారం అందిస్తేనే అడవుల విస్తీర్ణంలో వృద్ధి నమోదవుతుందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఇందు కోసం ప్రజలు అందరూ కలిసి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఓ వైపు అడవులను సంరక్షించుకుంటూనే, మరోవైపు అటవీ సంపదను పెంచేందుకు సమర్పణ, సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా వనమహోత్సవం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతోందన్నారు. ఇందు కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పెస్కోవా, అటవీ శాఖ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.













## ఎస్ టీపీల ఏర్పాటుకు స్థలం గుర్తించండి

- నగర మేయర్ గుండు సుధారాణి
- వివిధ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) లో భాగంగా ఏర్పాటు చేయనున్న సీవేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ (ఎస్ టీపీ) లకు కావాల్సిన స్థలాలను పరిశీలన చేయాలని నగరం మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగర పరిధి ఆరేపల్లి ప్రాంతంలోని అగ్రికల్చర్ కేంద్రం వారి వ్యవసాయ క్షేత్రం, బొల్లికుంట ప్రాంతాల్లో మేయర్ క్షేత్ర స్థాయిలో పర్యటించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎస్ టీపీల ఏర్పాటుకు గుర్తించిన జోన్ లలో ఇప్పటికే కొన్ని స్థలాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. మిగితా ప్రాంతాల్లో అనువైన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, డీఈలు రంగారావు, కృష్ణ మూర్తి, కన్సల్టెంట్ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్ సీలో మెరుగైన సేవలు అందించాలి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు మెరుగైన సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పేషంట్ వార్డును సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ కార్యాలయాన్ని సందర్శించి ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు సిబ్బంది హాజరు పట్టికను, స్టాక్ రిజిస్టర్, మెయింటెనెన్స్ రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



**శాస్త్ర సాంకేతిక అంశాల్లో రాణించాలి..**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక అంశాల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కక్కిరాలపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో స్ట్రెంథనింగ్ ఎఫ్ఎల్ఎన్ త్రు ఏఐ టూల్స్ వినియోగంతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పున్నేలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య శుక్రవారం సందర్శించారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, మార్చి 21, 2025

# దామెర చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా చేస్తా

## పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీయూఎఫ్ఐడీసీ, మున్సిపాలిటీ, ఇరిగేషన్ శాఖ అధికారులతో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ వెజిటేబుల్ మార్కెట్ ను పరిశీలించారు. దామెర చెరువు ప్రాంతాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం స్వయానా బైక్ నడుపుతూ దామెర చెరువు కట్ట, తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దామెర చెరువు ప్రాంతాన్ని మినీ ట్యాంక్ బండ్ గా త్వరలో ఏర్పాటు చేయబోతున్నామన్నారు. మినీ ట్యాంక్ బండ్ కు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. దామెర బండ్ ప్రాంగణంలో గ్రీనరీ, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్, ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్పోర్ట్స్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ను అమలు చేయబోతున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. కన్సల్టెన్సీ ద్వారా పరకాల పట్టణ అభివృద్ధికి డీపీఆర్ ను తయారు చేశామని, దానికి అనుగుణంగా పనులను చేపడుతున్నామన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇంటిగ్రేటెడ్ వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతాన్ని స్పోర్ట్స్ స్టేడియంలా మార్చుతామన్నారు. దీనికి సంబంధించిన విధివిధానాలను రూపొందించాలని అధికారులకు తెలియజేశారు. ఈ స్పోర్ట్స్ స్టేడియంలో ఇండోర్ స్టేడియం, ఫుట్ బాల్, స్విమ్మింగ్ పూల్, తదితర వాటిని ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు.

# "హైపర్" ప్రణాళికతో విద్యుత్ సరఫరా




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** భారీ వర్షాలు, ఈదురు గాలులు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ పునరుద్ధరణను వేగవంతం చేసేందుకు "హైపర్" అనే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని మహబూబాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ జె. నరేష్ తెలిపారు. "హైపర్" అంటే H–హెడ్ క్వార్టర్‌లో అప్రమత్తంగా ఉండటం, A–సిబ్బంది,సామగ్రినిసమీకరించడం,I–సముచితసమాచారాన్ని సేకరించడం, చేరవేయడం, P–పటిష్ట వ్యూహాన్ని అమలు చేయడం,E–నిర్దిష్ట కార్యాచరణను అమలుచేయడం, R–విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడమని తెలిపారు. ఈ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రతి ఉద్యోగి బాధ్యత తీసుకుని హెడ్ క్వార్టర్‌లో ఉండి అవసరమైన సామగ్రి, సిబ్బంది సమీకరించుకోవాలని సూచించారు. సంక్షిప్త సమాచారం సేకరించి, దాన్ని సముచితంగా చేరవేయడం, మెటీరియల్, సిబ్బందిని సమీకరించి వ్యూహాత్మకంగా కార్యాచరణ రూపొందించడం, ఆ తర్వాత దాన్ని అమలు చేయడం ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించవచ్చని వివరించారు. "హైపర్"ప్రణాళిక భారీ వర్షాలు, ఈదురు గాలుల సమయంలో అత్యంత ఉపయోగకరంగా ఉండి, విద్యుత్ పునరుద్ధరణను వేగవంతం చేస్తుందని ఆయన చెప్పారు. వినియోగదారులకు అత్యల్ప సమయంలో విద్యుత్ సరఫరా అందించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని, అదే సమయంలో నాణ్యతను మెరుగుపరచే దిశగా చర్యలు కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు.

# భూమిలేని నిరుపేదలంటే ఇంత చులకనా.!



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద సంవత్సరానికి రూ.12,000 అందిస్తామన్న ప్రభుత్వం, దీనికి తగిన విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం బాధాకరమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు మండిపడ్డారు. ఈ పథకానికి కేవలం రూ.600 కోట్లు కేటాయించడం సరిపోదని, లక్షలాదిగా ఉన్న భూమిలేని వ్యవసాయ కూలీలు, ఉపాధి కార్మికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిధులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కూడా తక్కువ నిధులు కేటాయించారని, ఈ పరిస్థితిలో సంవత్సరానికి 150 రోజులు పని కల్పించి రోజుకు రూ.400 కూలీ చెల్లించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సామాజిక పింఛన్లకు రూ.14,850 కోట్లు మాత్రమే కేటాయించడం వల్ల ఇప్పటికే పింఛన్ పొందుతున్న వారికి మాత్రమే అందుతుందని, కొత్తగా దరఖాస్తు చేసిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు ఇంకా నిరీక్షణలో ఉన్నారని తెలిపారు. 57 సంవత్సరాలు దాటిన వారు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా, ఆర్థిక మద్దతు అందకుండా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లకు కూడా తగినంత నిధులు కేటాయించలేదని విమర్శించిన ఆయన, బడ్జెట్ ప్రతిపాదనలను పునరాలోచించి, అర్హులందరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రాజీవ్ యువ వికాసం పథకానికి రేషన్ కార్డుతో ముడి పెట్టొద్దు



## ● పీవైఎల్ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించుటకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసేందుకు రేషన్ కార్డుతో ముడి పెట్టవద్దని పీవైఎల్ మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు బాలెం వెంకటేష్ కోరారు. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసే సమయంలో రేషన్ కార్డ్ ముడి పెట్టటం వలన రేషన్ కార్డు లేని పేదలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలించిన 10 సంవత్సరాలల్లో ఒక్క కార్డు కూడా ఇవ్వలేదని అదే నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచిన ఎటువంటి నూతన రేషన్ కార్డులు జారీ చేయ లేదన్నారు. నిరుపేద నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడే ఈ పథకం లబ్ధికి రేషన్ కార్డులు లేక ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ నిరుద్యోగుల ఈ అవకాశాన్నీ వినియోగించుకోలేక పోతున్నారన్నారు.
ప్రభుత్వం తక్షణమే స్పందించి రేషన్ కార్డులకు సంబంధం లేకుండా దరఖాస్తులను స్వీకరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరుద్యోగులు ఉద్యమిస్తారన్నారు.

# 25 నుంచి ఎఫ్ పీఓఎస్ రాష్ట్ర స్థాయి మేళా

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం రైతు ఉత్పత్తి దారుల సంఘాల (ఎఫ్ పీఓఎస్) రాష్ట్ర స్థాయి మేళాపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వివిధ శాఖల జిల్లా స్థాయి అధికార్లతో సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం జిల్లా అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, వ్యవసాయ శాఖ అధికారి అనురాధతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాల (ఎఫ్ పీఓఎస్) రాష్ట్ర స్థాయిలో మార్చి 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న ఈ మేళాలో రైతు ఉత్తతి దారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ శాఖలు ఎలా సమన్వయంతో పనిచేయాలానే అంశం పై జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అనంతరం అధికార్లందరితో కలిసి రంగశాపేటలోని సమావేశాస్థలాన్ని కలెక్టర్ సత్య శారద గారు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సత్యపాల్ రెడ్డి, డిఆర్డిఓ పిడి ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి, జిఎం ఇండస్ట్రియల్ అధికారి రమేష్, ఫిషరీస్ నాగమణి,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మురుగు కాల్వల్లో చెత్త వేయొద్దు

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** మురుగు కాల్వల్లో చెత్త వేయొద్దని ప్రజలకు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి సూచించారు. డివిజన్ లోని కొందరు ప్రజలు చెత్తాచెదారాన్ని మురుగు కాల్వల్లో వేయడం వల్ల నీరు నిలిచిపోయి, దోమల పెరుగుదల కారణంగా ప్రజలకు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు, మహానగర పాలక సంస్థ మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఉర్సు కుమ్మరి వాడలో మురుగునీరు నిలిచిన ప్రదేశాల్లో రసాయనిక మందులు స్ప్రే చేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి డ్రైనేజీల వద్ద ఉన్న ప్రజలకు సూచనలు చేస్తూ, తమ ఇంట్లోని చెత్తాచెదారాన్ని కార్పొరేషన్ సిబ్బందికి అప్పగించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ పెండ్యాల బాబు, సిబ్బంది ప్రదీప్, కిరణ్, సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# మూగజీవాల సజీవ దహన నిందితులను శిక్షించాలి

## బీజేపీ నేత కనుకుంట్ల రంజిత్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్ సమీపంలోని ఓ ప్రదేశంలో నిన్న రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 300కు పైగా గొర్రెలు సజీవ దహనం కావడం హృదయ విదారక ఘటన అని, నోరులేని ఆ మూగజీవాలను అమానుషంగా దహనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ అన్నారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం పోలీసులపై ఉందన్నారు. మూగజీవాలపై ఇంత కిరాతకమైన చర్యకు పాల్పడిన వారిని భగవంతుడు కూడా క్షమించడన్నారు.

# పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

**వరంగల్ వాయిస్, శాయంపేట :** పదో తరగతి వార్షిక పరీక్షలు మొదటిరోజు శుక్రవారం జరిగిన తెలుగు పరీక్షకు 298 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ గడ్డం భిక్షపతి తెలిపారు. జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 150 మంది విద్యార్థులు, ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో 148 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసినట్లు ఆయన తెలిపారు. తహసీల్దార్ సత్యనారాయణ రావు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

## వివాహిత ఆత్మహత్య

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలలో కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని డాక్టర్ పులి గోపాల్ రెడ్డి నగర్ లో చోటు చేసుకుంది. బాధావత్ మౌనిక (27) భాస్కర్ లకు 6 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. ఇటీవల కాలంలో భార్య మౌనిక–భర్త భాస్కర్ తరుచుగా ఘర్షణ పడుతున్నారు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో తన పిల్లలను బయట ఆడుకొమ్మని చెప్పి ఇంట్లో ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకొని మౌనిక ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా మౌనిక చీరతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఏప్రిల్ 6న నిర్వహించనున్న సీతారాముల కళ్యాణానికి గణపురానికి చెందిన విశాఖపట్నంలో నివాసం ఉంటున్న తాళ్లపల్లి కిరణ్మయి– రాజన్న దంపతులు స్వామి కళ్యాణానికి ముత్యాల తరంబ్రాల కోసం రూ.10,116లను ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ కు అందజేశారు. అదేవిధంగా రాజన్న మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించనున్న సీతారామ కళ్యాణానికి ముత్యాల తలంబ్రాలను పంపిస్తానని తెలపడం జరిగింది. అదే విధంగా గణపురం మండల కేంద్రానికి చెందిన మేడిపల్లి ప్రమీల కొమరయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీనివాస్, శ్రీకాంత్ ఆలయ అభివృద్ధికి రూ.10116 లను ఆలయ కమిటీ అధ్యక్షులకు అందజేయడం జరిగింది. ఆలయ అర్చకులు మునునూరి నరేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీత రమాదేవికి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా రంగశాయిపేట ప్రాంతానికి చెందిన ఎలుగు రమాదేవి మెప్మాలో మహిళలకు సేవలు అందించినందుకు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రంగశాయిపేటలోని మహిళా స్వశక్తి భవనంలో శుక్రవారం శ్రీరామ సమైక్య ఆధ్వర్యంలో రమాదేవిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీనిధి మేనేజర్ వెంకటేశ్వర్లు హాజరై రమాదేవిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మీరు కూడా రమాదేవి లాగానే మహిళలకు సేవలు అందిస్తే మీకు కూడా ఇలాంటి అవార్డు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ సమైక్య ఓబీ అధ్యక్షులు ఎం.కవిత, ఉపాధ్యక్షులు జి.రుక్మిణి, కార్యదర్శి ఎం.జీవనజ్యోతి, సహాయ కార్యదర్శి ఎం.పద్మ, కోశాధికారి కే.వనమాల, సమైక్య ఈసీ మెంబర్స్ డి.వాణి, ఎం.లలిత, డి.సరిత, బి.కవిత, పి.రమాదేవి, పి.మంజుల, పి.సరస్వతి, డి.కుమారి, బి.సంధ్య, టి.పద్మ, వి.స్వరూప, ఎల్.సునీత, పి.స్వరూప, బి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## క్రైం డీసీపీని కలిసిన వీసం సురేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో క్రైం డీసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బెదరకోట జనార్ధన్ ని శుక్రవారం వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి కమిషనరేట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకె అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# మహంకాళి ఆలయ భూముల కబ్జాకు యత్నం

### ◆ అడ్డుకున్న గ్రామస్తులు

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** మండల కేంద్రంలోని మహంకాళి ఆలయ భూములను కబ్జా చేసే యత్నాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. శుక్రవారం ఉదయం 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల పెద్దలు, సామాజిక కార్యకర్తలు ఆలయ పరిరక్షణ కోసం ఒకచోట చేరారు. ఆలయ స్థలానికి సంబంధించిన హద్దులను గుర్తించేందుకు, గతంలో నిర్మించిన పునాది ఆనవాళ్లను జేసీబీ సహాయంతో వెలికితీసేందుకు ప్రయత్నించారు. జీడబ్ల్యూఎంసీ కార్మికులు, ప్రజలు స్వచ్ఛందంగా కరసేవ నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన ఈ కార్యక్రమం మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది. గతంలో మాజీ కార్పొరేటర్ నాగమల్ల ఝాన్సీ సురేష్ ఆధ్వర్యంలో ఆలయ భూమి వివాదాన్ని పరిష్కరించేందుకు చేసిన ఒప్పందాన్ని గ్రామస్థులు గుర్తు చేశారు. అప్పట్లో ఆలయ భూమిని





వదిలివేస్తామని ప్రతిజ్ఞ చేసిన కొందరు, ఇప్పుడు ఆ ఒప్పందాన్ని విస్మరించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ పరిస్థితిని గమనించిన గ్రామ ప్రజలు, గత ఒప్పందాన్ని పాటించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆగ్రహం మధ్య, పాత పునాదిని తవ్వి ఆలయ భూమి హద్దులను ఖచ్చితంగా నిర్ణయించాలని పెద్దలు సూచించారు. జేసీబీ సహాయంతో తవ్వకాలు జరిపినప్పుడు ఆలయ స్థలానికి సంబంధించిన ఆనవాళ్లు బయటపడ్డాయి. ఈ ఆధారాల ఆధారంగా హద్దులను ఖరారు చేయనున్నట్లు కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలు, పూర్వీకుల కాలం నాటి ఆలయ ఆనవాళ్లను గుర్తుచేశారు. అయితే, కమిషనర్ ఆదేశించిన టౌన్ ప్లానింగ్ అధికారులు, బిల్డింగ్ ఇన్ స్పెక్టర్ లేదా చైన్‌మెన్ లాంటి అధికారులెవరూ ఈ పరిశీలనకు రాకపోవడం అనుమానాలకు తావిచ్చింది. ప్రజలు ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో అధికారుల నిర్లక్ష్య ధోరణిని తీవ్రంగా విమర్శించారు.

## హెచ్‌సీయూ భూములపై రేవంత్ రెడ్డి కన్ను



**వరంగల్ వాయిస్, కేయూ:** హెచ్‌సీయూ భూముల వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని, ఆ భూములను యూనివర్సిటీ యాజమాన్యానికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ, ఏబీవీపీ కాకతీయ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు మాట్లాడుతూ, “కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుకునే యూనివర్సిటీలను లక్ష్యంగా చేసుకుని, వారి భూములను కాజేసి తన అనుచరులకు అప్పగించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. “ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్ ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుందో, తన చర్యల ద్వారా రేవంత్ రెడ్డి చూపిస్తున్నాడు” అని విమర్శించారు. గతంలో విద్యార్థులు, మేధావులు, విద్యావేత్తలు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టు నిర్మాణం కోసం 100 ఎకరాలు లాక్కున్నారని, ఇప్పుడు డెవలప్ మెంట్ పేరుతో 400 ఎకరాల హెచ్‌సీయూ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకమైన హెచ్‌సీయూ, అగ్రికల్చర్ యూనివర్సిటీలపై కన్నేసిన రేవంత్ రెడ్డి, ఓయూలో నిర్బంధాన్ని అమలు చేస్తున్న ఈ ప్రభుత్వం, త్వరలో మిగతా యూనివర్సిటీల పైన కూడా దృష్టిపెడుతుందని హెచ్చరించారు. విద్యార్థులు అప్రమత్తమై ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని, లేకపోతే యూనివర్సిటీల మనుగడకే ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే వేలాన్ని నిలిపివేసి హెచ్‌సీయూ భూములను యూనివర్సిటీకి అప్పగించాలని, లేదంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు మేరుగు సాయి కుమార్, ఇంచార్జ్ నిమ్మల రాజేష్, రాష్ట్ర నాయకులు అంబాల కిరణ్, ప్రశాంత్, పూజ, శివ, రాజ్ కుమార్, సాయి ప్రియ, అభి, ఫణీంద్ర, చంద్రశేఖర్, జగత్ కృష్ణ, విష్ణువర్ధన్, వంశీ, జానకిరాం పాల్గొన్నారు.

## అంగన్వాడీ సెంటర్ పరిశీలన



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోని అంగన్వాడీ పాఠశాలను దామెర ఎస్సై కొంకా అశోక్ శుక్రవారం పరిశీలించారు. అంగన్వాడీ చిన్నారులు మధ్యాహ్న భోజనం చేస్తుండగా వారి మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ టీచర్లు విద్యార్థులకు బోధిస్తున్న విద్యను ఎస్ఐకి వివరించారు. దీంతో ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## పది పరీక్షలు ప్రశాంతం

**వరంగల్ వాయిస్, దామెర :** మొదటిరోజు పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి లకావత్ రాజేష్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మొదటి రోజు తెలుగు పేపర్ పరీక్షలో 223 మంది విద్యార్థులకు గాను 223 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# కృత్రిమ మేధస్సుపై ప్రత్యేక శిక్షణా శిబిరం

**వరంగల్ వాయిస్, హనుమకొడ :** వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఇంజినీరింగ్, ఎంబీఏ విద్యార్థుల కోసం కృత్రిమ మేధస్సును ఆధారంగా చేసుకుని డిజిటల్ వ్యవస్థాపకతపై మూడు రోజుల ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ సెల్ (E.D.C.)ఆధ్వర్యంలో మార్చి 19 నుంచి 21 వరకు నిర్వహించగా, దాదాపు 300 మంది విద్యార్థులు, యువ ఔత్సాహికులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో డిజిటల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు, సీఈఓ నీకేలు గుండా మాట్లాడుతూ ముఖ్యంగా ఏఐ టూల్స్, డిజిటల్ వనరులను వినియోగించి విద్యార్థులు తమ వ్యాపార ఆలోచనలను ఎలా వ్యాపార మోడళ్లుగా మార్చుకోవచ్చో వివరించారు. అలాగే, డిజిటల్ మార్కెటింగ్, బిజినెస్ మోడల్ కాన్వాస్ వంటి కీలక వ్యాపార అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో స్టార్టప్ ప్రారంభించే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ శిక్షణా శిబిరం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో OnEasy.AI వ్యవస్థాపకుడు అభిషేక్ బొద్దు, విగ్నాన్ ఫౌండేషన్‌కు చెందిన డా.సురేష్ చంద్ర, కుమార్ గుంటుపల్లి ముఖ్య వక్తలుగా పాల్గొని తమ అనుభవాలను, వ్యాపార వ్యూహాలను, ఆవిష్కరణా తత్వాలను విద్యార్థులతో పంచుకున్నారు.




ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.కె. తిరుపతి రావు మాట్లాడుతూ, “ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు కేవలం సాంకేతిక నైపుణ్యాలను మాత్రమే కాదు, వ్యాపారంలో విజయాన్ని సాధించడానికి అవసరమైన ఆలోచనా విధానాన్ని కూడా అభివృద్ధి చేసుకోవచ్చు” అని అన్నారు. కార్యక్రమాన్ని E.D.C.సమన్వయకుడు డా. వేణు కేసిరెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె. ప్రకాష్, ఎంబీఏ విభాగాధిపతి డా. వై. భాస్కర్ రావు, ఇతర అధ్యాపకులు, విభాగాధిపతులు సమర్థవంతంగా నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరం విద్యార్థులకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ వ్యాపారం, స్టార్టప్ ఆలోచనలు వంటి రంగాల్లో ఉత్తేజాన్ని అందించడంతో పాటు, భవిష్యత్తులో విజయవంతమైన ఔత్సాహికులుగా ఎదిగే ప్రేరణను కలిగించింది.

# మహిళలకు చేయూత వరం లాంటిది



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహిళలకు చేయూత వరం లాంటిదని మహబూబాబాద్ రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ సర్వయ్య అన్నారు. శుక్రవారం జంగిలిగొండలో చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రారంభించిన కుట్టుమిషన్ శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ జర్నలిస్ట్ గుండెల రాజు సారధ్యంలో చామకూరి సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ సర్వయ్య మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళ పాత్ర కీలకమన్నారు. పురుషాధిక్య ప్రపంచంలో మహిళ తన ప్రాముఖ్యతను చాటుకోవడానికి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. మహిళలు ఈ కుట్టు మిషన్ శిక్షణ ద్వారా ఆర్థికంగా వృద్ధి చెందడమే కాకుండా కుటుంబానికి ఆసరాగా నిలిచి ఆత్మగౌరవంతో బతుకుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దేవరం ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు అంతా గ్రామంలోని యువతదే అన్నారు. గ్రామ యువత ఇలాంటి కార్యక్రమాల ద్వారా గ్రామాభివృద్ధికి పాటుపడుతూ తమ చిత్తశుద్ధిని చాటుకుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికా రెడ్డి, శంతన్ రామరాజు, లోకేష్, పంజాల సురేష్, మట్టిగజం వీరేశ్, భూం హరీష్, ఫైండ్ల మదు, గోల్కొండ సతీష్, చామకూరి యాసీన్, గోల్కొండ శ్రీకాంత్, కోయ్యాల అనిల్, పెరుమండ్ల ప్రతాప్ ,కొమ్మరాజుల భరత్, ఫైండ్ల రాధాకృష్ణ, పంజాల సందీప్, పోతుగంటి రమణాచారి, ఇరుగు ప్రభాస్, కుంట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహార శుద్ధి పరిశ్రమ ఏర్పాటు



**వరంగల్ వాయిస్, రేగొండ :** రాష్ట్రంలో రైతులు ఆరుగాలం కష్టంతో పండించిన పంటలకు ఆదాయం పెరగడంతో పాటు, ప్రజల ఆరోగ్యం కాపాడేలా ప్రతి రైతు బాధ్యతగా పంటల సాగును చేయాలని భూపాలపల్లి జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు అన్నారు. శుక్రవారం రేగొండ మండల కేంద్రంలోని జేబిడి సొసైటీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు విలేకరులతో మాట్లాడుతూ 23న ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయరంగ అభివృద్ధికి ప్రత్యక్షంగా పరోక్షంగా కృషి చేస్తున్న వారికి ఉగాది పురస్కారాలను అందజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 23న, గూడేపాడు ఎన్ఎస్ఆర్ గార్డెన్ లో జరిగే ఉగాది పురస్కారాల కార్యక్రమానికి రైతులతో పాటు, మీడియా మిత్రులు, రైతు నాయకులు, తదితరులు పాల్గొని తమ అమూల్యమైన సందేశాలను రైతులకు అందజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రైతు అవగాహన సదస్సుకి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. వ్యవసాయరంగ ప్రముఖులు, రైతు సంఘాల నాయకులు సొసైటీ సభ్యులు , రైతులంతా తరలిరావాలని సొసైటీ అధ్యక్షులు సిరికొండ తిరుపతిరావు పిలుపునిచ్చారు. అలాగే రైతులు సీవీఆర్ పద్ధతిని పాటిస్తూ, ఎస్పీకే విధానంలో వ్యవసాయం చేస్తే ఒక సంవత్సరం కొద్దిగా ఇబ్బంది అనిపిస్తది కావచ్చు కానీ, అతి తక్కువ ఖర్చుతో అన్ని రకాల పంటలు పండించవచ్చునని ఆయన అన్నారు. ఖర్చు తక్కువ అయినప్పుడు, మార్కెట్ ధరల ఒడిదోడుకులకు రైతు ఇబ్బంది పడకుండా ఉండునని, రసాయనాలు లేని ఆహారాన్ని మన కుటుంబ అవసరాలకు వాడుకోవచ్చునన్నారు. అలాగే ప్రజలకు మంచి ఆహారాన్ని అందించిన వారం అవుతామని తిరుపతిరావు పేర్కొన్నారు. సొసైటీ తరపున ఆహారశుద్ధి పరిశ్రమ ఏర్పాటు చేసి, విష రసాయనాలు లేని ఆహార ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేయడం, ప్రజలకు రసాయన రహిత ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ఈ అవగాహన సదస్సు ఉపయోగపడాలని ఈ సందర్భంగా సిరికొండ తిరుపతిరావు తెలియజేశారు.

# హలో బీసీ.. చలో ఢిల్లీని విజయవంతం చేయండి

➲ 27న మహా ధర్నాకు వేలాదిగా తరలిరండి

➲ బీసీ నేత వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న "హలో బీసీ.. చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్ర ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల కోటాలో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కులగణన చేపట్టి, బీసీ రిజర్వేషన్లు 42శాతం పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రత్యేక చట్టంగా ఆమోదించాలనే డిమాండ్‌తో ఈ నెల 27న జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీల సంఖ్యను తేల్చాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహాధర్నాకు వరంగల్ ఉమ్మడి జిల్లాలోని బీసీ విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు వేలాదిగా తరలిరావాలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, జిల్లా ఉపాధ్యక్షుడు కాసగాని అశోక్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జ్ అరగంటి నాగరాజ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం పద్మజా దేవి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మెల శోభారాణి, జిల్లా అధ్యక్షురాలు మాడిశెట్టి అరుంధతి, సులోచన, ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

# ఓయూలో ఉద్యమాలపై నిషేధం ఉపసంహరించాలి




**వరంగల్ వాయిస్, కేయూ:** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సదస్సులు, సెమినార్లు, ధర్నాలు నిర్వహించడంపై నిషేధం విధిస్తూ ఓయూ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్కులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత (పీడీఎస్‌యూ) కాకతీయ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి వి. కావ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కె.యూ. మొదటి గేటు వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వి. కావ్య మాట్లాడుతూ ఓయూలో విద్యార్థి ఉద్యమాలపై విధించిన ఆంక్షలు ప్రజాస్వామ్య విరుద్ధమని, రాజ్యాంగ ప్రదత్తమైన భావ ప్రకటన స్వేచ్ఛకు వ్యతిరేకమని విమర్శించారు. ఓయూ అనేక ప్రజాస్వామిక ఉద్యమాలకు వేదికైందని, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో విశేషమైన పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో, విద్యార్థుల హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన ఈ సర్కులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని సంబంధిత యూనివర్సిటీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. లేదంటే, రాష్ట్రవ్యాప్తంగా పీడీఎస్‌యూ ఇతర విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ కాకతీయ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు పి.అనూష, గణేష్, యూనివర్సిటీ నాయకులు శ్రీజ, శివాంజీ, ప్రశాంత్, రాజ్ కుమార్, నరేష్, సిద్ధు, నాగరాజు పాల్గొన్నారు.

# చింతగట్టులో పశువైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** వికాస తరంగిణి హనుమకొండ జిల్లా వారి ఆధ్వర్యంలో శుక్రవారం చింతగట్టులోని మహర్షి గోశాలలోని గోవులకు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ తిదండి చిన్న జీయర్ స్వామి ఆశీస్సులతో గోపూజ నిర్వహించి గోశాలలోని గోవులకు పరీక్షించి ఉచితంగా బలవర్ధకమైన టానిక్ లు, మినరల్ మిక్సర్లు, ఇంజెక్షన్ లు, ఇతర మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి ఉపాధ్యక్షుడు, పశుసంవర్ధక శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చాడ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ మహర్షి గోశాల నిర్వాహకులు గోశాలలోని గోవులను చక్కగా సంరక్షిస్తూ ప్రతి ఆదివారం క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందజేయడం, గోఆధారిత మందులు పంచగవ్యం, గోమూత్రం, ఆవు పిడకలు అందజేయడం పట్ల నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ అధికారుల సహకారంతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉచిత పశువైద్యశిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని, వీటిని రైతులు చక్కగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి.శ్రీనివాస్, హసన్ పర్తి పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతి, చింతగట్టు వీఎల్ఓ బింగి సురేష్, వికాస తరంగిణి సభ్యులు దయాకర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, తిరుమల్, మహర్షి గోశాల నిర్వాహకులు శ్రీ సర్జన రమేష్, వివేక్ సాగర్, యాదగిరి, ఓఎస్ రాహుల్, రైతులు పాల్గొన్నారు.

# సీతారామ కళ్యాణానికి విరాళాలు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఏప్రిల్ 6న జరగబోవు సీతారాముల కళ్యాణ మహోత్సవానికి గణపురానికి చెందిన శ్రీరామ గోపీనాథ్ 30 లీటర్ల వంటనూనె, కృష్ణ సెల్ వరల్డ్ నిర్వాహకులు 25 కేజీల బియ్యాన్ని, శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి గోల్డ్ షాప్ నిర్వాహకులు 25 కేజీల బియ్యాన్ని, కరెంటు డిపార్ట్ మెంట్ రఘుపతి 25 కేజీల బియ్యాన్ని, శ్రీ లక్ష్మీ ఏజెన్సీ నిర్వాహకులు సతీష్ రెడ్డి 50 కేజీల బియ్యాన్ని, రంగు ముక్తేశ్వర్ 25 కేజీల బియ్యాన్ని, రంగు జగదీశ్వర్ 15 లీటర్ల వంట నూనె, కొత్తపల్లి గ్రామానికి చెందిన మామిళ్ల మల్లేష్ వార్డ్ నెంబర్ 25 కేజీల బియ్యాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ కు అందజేయడం జరిగింది. అదే విధంగా కళ్యాణ మహోత్సవం రోజున భక్తులకు బండి సాంబయ్య లక్ష్మి దంపతులు మజ్జిగ ప్యాకెట్లను వితరణ చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షల సరళి పరిశీలన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పదో తరగతి పరీక్షల సరళిని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించిన జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో (8183 )కి గాను పరీక్షలకు హాజరైన వారి సంఖ్య (8176) కాగా (7) గైహాజరయ్యారు, 99.91, శాతం నమోదు అయ్యిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి తెలిపారు.

# బీసీ బిల్లు ఆమోదంపై హర్షం

## డాక్టర్ రాజేంద్ర ప్రసాద్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింప చేసినందుకు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక పక్షాన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు, ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తున్నట్లు ఐక్యవేదిక పేర్కొంది. వరంగల్ జిల్లా కేంద్రంలోని రామన్నపేటలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సీనియర్ ఫ్యామిలీ డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా జిల్లాలోని వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈసారి జరిగే గ్రామ పంచాయతీ వార్డు ఎన్నికలు మొదలు పార్లమెంటు వరకు బీసీల ఓటు బీసీలకే వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కట్ట ఈశ్వర్ ప్రసాద్ విశ్వబ్రాహ్మణ మాట్లాడుతూ బీసీలం మనమేంతో – మన కంతా మనవాటా మనకు దక్కాల్సిందేనని కోరారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి సమ్మయ్య ముదిరాజ్, శారద మున్నూరు కాపు, గోలి ఎల్లయ్య గంగపుత్ర, రాజు సగర, వీర్ నారాయణ మేర తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

## ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ కల్లూరి పవన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 23న నిర్వహించే జాబ్ మేళాను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ కల్లూరి పవన్ కోరారు. నిరుద్యోగుల కోసం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 23న ఆదివారం ఉదయం 10:00 గంటలకు వాగ్దేవి డిగ్రీ కళాశాల ఆడిటరియంలో జాబ్ మేళాను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ పదవ, ఇంటర్, డిగ్రీ చదివిన మహిళలందరూ తమ సంబంధిత సర్టిఫికెట్స్ తో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ హాజరవుతారని పేర్కొన్నారు. కాబట్టి, నిరుద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పాఠశాల విద్యార్థులకు అవగాహన

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ట్వినింగ్ ఆఫ్ ద స్కూల్స్ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు మండల విద్యాధికారి కె.హనుమంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నడికూడ మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలు చౌటుపర్తి, ముస్త్యాలపల్లి, పులిగిల్ల, నర్సక్కపల్లి గ్రామాల పాఠశాలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నడికూడ ఉన్నత పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, వసతులు, విద్యార్థులు పరిశీలించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, కిచెన్ గార్డెన్, డిజిటల్ క్లాస్ రూమ్ పరిశీలించి ఉన్నత పాఠశాల పట్ల ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విజ్ఞానాన్ని, ఆనందాన్ని, సంతోషాన్ని పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్రైవేటు అప్పులు తీర్చేందుకు రైతులకు బ్యాంకు రుణాలు

## రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి రావు




**వరంగల్ వాయిస్, పరకాల :** బ్యాంకర్లు, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు, రైతులతో హనుమకొండ, వరంగల్ న్యాయ సేవాధికారుల కార్యదర్శులు ( గౌరవ సీనియర్ జడ్జి) సమావేశం నిర్వహించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులందరూ వినియోగించుకోవాలని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు కోరారు. రైతులు వారి ప్రైవేట్ అప్పులు తీర్చుకోడానికి, రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా మార్గ దర్శకాల ప్రకారం పాకాల శ్రీహరి రావు, గౌరవ తెలంగాణ హై కోర్టులో వేసిన ప్రజా ప్రయోజన వాజ్యం (పిల్) 269/2018 ఉత్తర్వుల ప్రకారం బ్యాంకుల నుంచి పంట రుణాలకు అదనంగా దీర్ఘ కాలిక రుణాలు అవసరమున్న రైతల రుణ దరఖాస్తులు చేసుకోవాలని హనుమకొండ, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు సీనియర్ జడ్జి కామ దేశపాండే, ఎం.సాయికుమార్ రైతులకు సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శుల సూచన మేరకు అర్హులైన రైతులందరికీ ప్రైవేట్ అప్పులు తీర్చుకోడానికి అదనపు రుణాలు మంజూరు చేయడానికి బ్యాంకర్లు ఒప్పుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రైవేట్ అప్పుల బాధతో ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వెంటనే వారి బ్యాంకులలో ఇలాంటి అప్పుకు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్, తిరుపతి, రాజు, బాపురావు, తోకల్ ఆది రెడ్డి సిఫా కోఆర్డినేటర్, హనుమకొండ లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి రవి కుమార్, ఇతర బ్యాంకుల అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారులు, వివిధ గ్రామాల రైతులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, జిల్లా వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులను ఖండించండి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం పీడీఎస్ యూ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రయత్నించిన విద్యార్థి సంఘ నాయకులను పోలీసులు విచక్షణారహితంగా కొడుతూ, అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించారని పీడీఎస్ యూ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఈ అరెస్టులను ఖండిస్తూ, పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ, తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం విద్యా రంగానికి 20% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, మెడికల్ మరియు నర్సింగ్ కళాశాలలు, కొత్తగా ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్, జేఎన్టీయూ కళాశాలల కోసం సరిపడ నిధులు కేటాయించకుండా కేవలం 7.57% మాత్రమే ఇవ్వడం తగదని, ఇది విద్యా వ్యతిరేక బడ్జెట్ అని విమర్శించారు. బడ్జెట్‌ను సవరించి విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, ప్రభుత్వ విద్యను సంక్షోభంలోకి నెడే కుట్ర జరుగుతోందని, నూతన జాతీయ విద్యా విధానం – 2020, యూజీసీ ముసాయిదా, డి–టెన్షన్ విధానాలను వ్యతిరేకిస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఏడో గ్యారంటీ ప్రకారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఉండాల్సిన పరిస్థితుల్లో, ఉస్మానియా యూనివర్సిటీలో విడుదలైన వీసీ సర్క్యులర్ ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. ఈ సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ ముట్టడిలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, జిల్లా నాయకులు రాజేష్ సహా పీడీఎస్ యూ వివిధ జిల్లాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి, హైదరాబాద్‌లోని కంచన్ బాగ్, చంద్రయాన్ గుట్ట పోలీస్ స్టేషన్లకు తరలించారు. వారిని తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్ యూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తూ, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలను ఈ అరెస్టులను ఖండించాలని కోరింది.

# జిల్లా స్థాయి "ట్రెయినింగ్ ఆఫ్ ట్రైనర్స్"



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు మహబూబాబాద్ పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో శుక్రవారం జిల్లా స్థాయి "ట్రెయినింగ్ ఆఫ్ ట్రైనర్స్" (T.O.T) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమం "జాతీయ సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్"పై అవగాహన కల్పించేందుకు జిల్లాలోని వైద్యాధికారులకు అందించబడింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ మాట్లాడుతూ, సికిల్ సెల్ అనీమియా ఒక వంశానుగత రక్త సంబంధ వ్యాధి అని వివరించారు. సాధారణంగా, ఆరోగ్యకరమైన ఎర్ర రక్త కణాలు గుండ్రంగా ఉండి రక్తనాళాల ద్వారా శరీరమంతా ప్రయాణించి ఆక్సిజన్‌ను సరఫరా చేస్తాయి. అయితే, జన్యు మార్పుల కారణంగా కొంత మంది వ్యక్తులలో ఈ కణాలు కొడవలి (సికిల్) ఆకారాన్ని దాలుస్తాయని, దీని ప్రభావంతో రక్త సరఫరా ప్రతిబంధితమవుతుందని తెలిపారు. ఒక వ్యక్తి రక్తంలో సికిల్ సెల్ జన్యువులలో ఒకటి మాత్రమే ఉంటే, వారు సికిల్ సెల్ క్యారియర్లుగా ఉంటారు. వీరికి ఆరోగ్యపరమైన గంభీరమైన సమస్యలు ఉండవు. అయితే, ఇద్దరు క్యారియర్‌ల వివాహం చేసుకుంటే, వారి పిల్లలు పూర్తిగా సికిల్ సెల్ అనీమియాతో జన్మించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ఆయన హెచ్చరించారు. సాధారణ ఎర్ర రక్తకణాల జీవితకాలం 120 రోజులు ఉంటే, సికిల్ సెల్ కణాలు కేవలం 20–25 రోజులు మాత్రమే జీవిస్తాయి, తద్వారా రక్తహీనత (అనీమియా) సమస్య ఏర్పడుతుంది. సికిల్ సెల్ అనీమియా లక్షణాలు సాధారణంగా ఆరు నెలల వయస్సు నుంచే ప్రదర్శితమవుతాయి. లక్షణాలు వ్యక్తిగతంగా మారుతూ ఉండవచ్చని, ప్రధానంగా తీవ్రమైన రక్తహీనత, దీర్ఘకాలిక కామెర్లు (జాండీస్), కీళ్ల నొప్పులు, ఛాతి & నడుము నొప్పి, చేతులు, కాళ్ల వాపు, తరచుగా ఇన్ఫెక్షన్లు, పెరుగుదలలో జాప్యం, దృష్టి సమస్యలు వంటి అంశాలు కనిపించవచ్చని వివరించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, సికిల్ సెల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ గణేష్ (పీడియాట్రిషన్, నిమ్స్), టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ (ఎన్ హెచ్‌ఎం), డిప్యూటీ మాస మీడియా అధికారి కొప్పు ప్రసాద్, కె.వి. రాజు, పురుషోత్తం, శారద (హెల్త్ ఎడ్యుకేటర్స్), సబ్ యూనిట్ ఆఫీసర్స్ రామకృష్ణ, వడ్డెబోయిన శ్రీనివాస్, డీఈవో ఉమాకర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తెక్కిస్తున్న వామికా గబ్బి



సోషల్ మీడియాలో ఎవరు ఎప్పుడు ట్రెండ్ అవుతారో చెప్పలేం. అలా ఈ హాట్ బ్యూటీ ఇప్పుడు యమా ట్రెండిరగ్ అవుతోంది. ఈ బ్యూటీ ఓరకంటతో చూస్తున్న ఫోటోలు నెట్టింట తెగ ట్రెండ్ అవుతోంది. ఇంతకీ ఆమె ఎవరా అని అనుకుంటున్నారా.! కేవలం ఒకే ఒక్క తెలుగు సినిమా చేసిన ఈమె మరెవరో కాదు.. వామికా గబ్బి. సుధీర్ బాబు హీరోగా తెరకెక్కిన 'భలే మంచి రోజు' సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమైంది. ఈ మూవీ కమర్షియల్‌గా ఫెయిల్ కావడంతో వామికా మళ్లీ తెలుగులో మరే చిత్రంలో నటించలేదు పంజాబీ, హిందీ, మలయాళం, తెలుగు సినిమాల్లో నటించింది వామికా గబ్బి. 2007లో 'జబ్ వి మెట్' సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి వచ్చినా.. ఇప్పటివరకు ఈ బ్యూటీకి సరైన బ్రేక్ దక్కలేదు. 2023లో 'ఖుఫియా' అనే హిందీ సినిమాతో వామికా బాగా ఫేమస్ అయింది. ఈ చిత్రంలో ఆమె నటించిన బోల్డ్ సీన్స్ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయ్యాయి. దాంతో ఈ బ్యూటీకి క్రేజ్ కూడా డబుల్ అయ్యింది. తాజాగా వరుణ్ ధావన్ హీరోగా వచ్చిన 'బేబీ జాన్' మూవీతో ప్రేక్షకులను పలకరించింది. ఇందులో వామికా.. టీచర్ పాత్రలో నటించి తన నటనకు గానూ మంచి మార్కులు తెచ్చుకుంది. ఇక అడివి శేష్ హీరోగా వస్తోన్న 'గూఢచారి -2' సినిమాతో మరోసారి తెలుగులో రీ-ఎంట్రీ ఇవ్వనుంది.

# అప్పటికీ ఇప్పటికీ అదే అందం మారలేదు

టాలీవుడ్ సీనియర్ నటి శ్రీయా శరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఒకప్పుడు వరస సినిమాలతో మంచి ఫేమ్ సంపాదించుకుంది ఈ చిన్నది. తెలుగు చిత్ర పరిశ్రమలో అందరి స్టార్ హీరోల సరసన నటించడమే కాకుండా లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్స్‌తో కూడా తన సత్తా చాటింది. ఇక చాలా కాలంగా ఈ బ్యూటీ అంతగా సినిమాలు చేయడం లేదు. ముఖ్యంగా కరోనా తర్వాత సినిమాలకు గుడ్ బై చెప్పి తన కూతురును చూసుకుంటూ ఉంది. ఈ మధ్య ఈ అమ్మడు పలు సినిమాల్లో స్పెషల్ పాత్రల్లో కనిపిస్తూ సందడి చేస్తుంది. ఇక సినిమాల్లో కంటే ఈ బ్యూటీ ఈ మధ్య సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది. వరస ఫొటో షూట్స్‌తో కుర్రకారు మతిపోగొడుతుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ పింక్ కలర్ డ్రెస్‌లో సరికొత్త లుక్‌లో దర్శనం ఇచ్చింది. కుర్ర హీరోయిన్స్‌కు ఏ మాత్రం తీసిపోకుండా తన అందంతో మాయ చేస్తుంది ఈ చిన్నది.







# నాకన్నా చిన్నపిల్లాడిలా కనిపిస్తాడు

బాలీవుడ్ ముద్దగుమ్మ జాన్వీ కపూర్ హీరోయిన్ గా హిందీలో రాణిస్తుంది. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీస్ లోనూ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోతుంది ఈ చిన్నది. ఇక సోషల్ మీడియాలో జాన్వీ అందాలకు యమా క్రేజ్ ఉంది. అందాలు ఆరబోస్తూ కుర్రాళ్లను కవ్విస్తుంది ఈ చిన్నది. ఇక ఈ బ్యూటీ దేవర సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో తన నటనతో పాటు అందంతోనూ మెప్పించి మంచి మార్కులు కొట్టేసింది జాన్వీ. ఇక ఇప్పుడు ఈ అమ్మడు దేవర 2లో నటిస్తుంది. అలాగే రామ్ చరణ్ తోనూ నటిస్తుంది. ఇదిలా ఉంటే జాన్వీ కపూర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. జాన్వీ కపూర్ గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ టాలీవుడ్ స్టార్ హీరో గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఆయన వయసు రోజు రోజుకు తగ్గుతుంది అని చెప్పుకొచ్చింది. ఇంతకూ ఆ స్టార్ హీరో ఎవరో తెలుసా.? మీరు గెస్ చేసే ఉంటారు ఆయన ఎవరో కాదు సూపర్ స్టార్ మహేష్ బాబు. గతంలో ఓ ఇంటర్వ్యూలో మహేష్ గురుంచి జాన్వీ మాట్లాడిరది. మహేష్ బాబు గురించి మాట్లాడుతూ.. ఆయనకు వయసు అవ్వదు. ఆయనకు రోజు రోజుకు వయసు తగ్గిపోతుంది. ఎంతో హ్యాండ్సమ్ గా ఉంటారు. కొన్నిసార్లు నా కన్నా చిన్నవాడిగా కనిపిస్తారు అని తెలిపింది జాన్వీ. ఈ కామెంట్స్ ను మహేష్ అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. మహేష్ ప్రస్తుతం రాజమౌళి సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తుంది. ఇటీవలే ఒడిశాలో షూటింగ్ పూర్తి చేశారు టీమ్. అలాగే జాన్వీ ప్రస్తుతం రామ్ చరణ్ బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది.

# వోడ్కాను తప్పితే.. దేనినీ ప్రమోట్ చేయను..

## రాంగోపాల్‌వర్మ

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వివాదం హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ వ్యవహారంలో పలువురు తెలుగు సినీ సెలబ్రిటీలతో పాటు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదయ్యాయి. అయితే తాజాగా ఈ వివాదంపై ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందించాడు. రామ్ గోపాల్ వర్మ నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం శారీ. యథార్థ సంఘటనల ఆధారంగా వస్తున్న ఈ చిత్రంలో ఆరాధ్య దేవి కథానాయికగా నటిస్తుంది. వర్మ ఈ సినిమాకు కథను అందించగా.. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. ఆర్వీప్రొడక్షన్స్ పతాకంపై రవి వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని ఏప్రిల్ 04న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా ప్రమోషన్స్ నిర్వహించింది చిత్రయూనిట్. ఈ వేడుకలో ఆర్జీవీ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ గురించి మాట్లాడుతూ.. నేను బెట్టింగ్ యాప్స్ గురించి తెలియదు. ఎందుకంటే ఇంతకుమందు కూడా నేను ఎటువంటి యాడ్‌లలో నటించలేదు. అలాగే నా సోషల్ మీడియా అకౌంట్స్‌ని కూడా ప్రమోషన్‌కి వాడలేదు. ఒకవేళ నేను ప్రమోట్ చేయాలి అనుకుంటే వోడ్కానే ప్రమోట్ చేస్తా.. బెట్టింగ్ యాప్స్ కాదు. ఎందుకంటే కొన్ని ప్రమోట్ చేయాలంటే అవి లీగలా కాదా అనేది ఎవరికి తెలిసి ఉండదు. ప్రభుత్వం ఇవి లీగల్ అని ప్రజలకు అవగాహన కల్పించాలి. స్టార్ నటులను తీసుకుంటే బెట్టింగ్ యాప్స్ కాకుండా చాలా బ్రాండ్‌లను ప్రమోట్ చేస్తూ ఉంటారు. అవి లీగల్ అని ఎలా తెలుస్తది. సడన్‌గా ఒకరోజు వచ్చి అవి ప్రమోట్ చేయడం నేరం అంటారు. ఇలాంటివి చేసే ముందు ప్రభుత్వం అవేర్‌నెస్ క్రియేట్ చేయాలంటూ ఆర్జీవీ చెప్పుకోచ్చాడు.



# కూలికెళితే .. ప్రాణం పోయింది

- నర్సింహులపేటలో ఘోర రోడ్డు ప్రమాదం
- కూలీలతో వెళ్తున్న ఆటోను ఢీ కొన్న లారీ
- ఒకరి మృతి, నలుగురి పరిస్థితి విషమం
- మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామ శివారు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొన్న సంఘటనలో చర్లపాలెం గ్రామానికి చెందిన గూడెల్లి అరుణ (38) మృతి చెందగా మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన 14 మంది, ఫతేపుంర గ్రామానికి చెందిన ముగ్గురు మొత్తం 17 మంది మహిళా కూలీలు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలంలో మిర్చి ఏరడానికి ఆటోలో వెళ్తున్నారు. వీరు వెళ్తున్న ఆటోను పెద్దనాగారం శివారు ఇటుక బట్టీల సమీపంలో గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో ఆటో అదుపుతప్పి పల్టీలు కొడుతూ చెట్ల పొదల్లోకి దూసుకుపోయింది. గాయాలైన వారిని సహచర కూలీలు పోలీసులు, స్థానికుల సహకారంతో మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాద స్థలంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటనకు కారణమై ఆపకుండా వెళ్లిన లారీ ఆచూకీ కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు.

## పరామర్శించిన ఝాన్సీ రెడ్డి..


విషయం తెలిసిన వెంటనే పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రెడ్డి హుటాహుటిన మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి చేరుకుని మృతురాలి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గూడెల్లి అరుణ భర్త సాయిలును ఓదార్చారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు తక్షణంగా ఆర్థిక సహాయం అందించారు. పరిస్థితిపై డాక్టర్లతో మాట్లాడి, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితుల సంక్షేమానికి ఎలాంటి సహాయం అవసరమైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. విషయాన్ని అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేకు తెలియజేయగా ఆమె ధిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె వెంట తొర్రురు బ్లాక్ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, మహబూబాబాద్ నియోజకవర్గ నాయకులు, పట్టణ నాయకులు, మహబూబాబాద్, తొర్రురు యువజన నాయకులు, తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ నేతల పరామర్శ..

మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచనల మేరకు మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం జిల్లా ఆస్పత్రికి చేరుకుని గాయపడిన వారిని పరామర్శించారు. తీవ్రంగా గాయపడిన వారికి నాణ్యమైన వైద్యం అందించాలని డాక్టర్ల బృందాన్ని బీఆర్ఎస్ నాయకులు కోరారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్, ఖమ్మం , హైదరాబాదు హాస్పిటల్స్ కి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మాజీ జడ్పీటీసీ, మహబూబా జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ మంగలపెల్లి శ్రీనివాస్, తొర్రూర్ మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, మహబూబబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, మహబూబాబాద్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జిల్లా పరిషత్ మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఎండీ పాషా, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మార్నేని రఘు, తొర్రూర్ మండల్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నలమస ప్రమోద్, చెర్లపాలెం మాజీ ఎంపీటీసీ దర్మారపు కిరణ్ తదితరులు పాల్గొన్నానరు.







# జనగామ జిల్లా పేరును.. సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా మార్చాలి

**తెలంగాణ గౌడ సంఘాల సమన్వయ వేదిక నాయకుల విజ్ఞప్తి**

**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ జిల్లా పేరును సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేయాలని తెలంగాణ గౌడ సంఘాల సమన్వయ వేదిక నాయకులు అంబాల నారాయణ గౌడ్, వంగ సదానందం గౌడ్, పంజాల జైహింద్ గౌడ్ తో పాటు పలువురు నాయకులు విజ్ఞప్తి చేశారు. వేదిక సమన్వయకర్త కన్న పరశురాములు గౌడ్ అధ్యక్షతన గౌడ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన దీక్ష శిబిరంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఇతర బహుజన కులాలకు చెందిన నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. దీక్షకు ముందు చౌరస్తాలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుజిల్లాల సంఘాల నాయకులు, బహుజన నాయకులు చీపురు మల్లేశ్ యాదవ్, చల్లా సుదీర్ రెడ్డి, అంకెనపల్లి వేంకటేశ్వర్లు, సానాడి రాజు, గిద్ద రామ్నార్సయ్య, గొలుసుల దుర్గాచలం తదితరులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. 120 మంది నాయకులు దీక్షలో పాల్గొన్నారు. కాగా సుమారు రెండు వేలకు పైగా గౌడ కులస్తులు, గీత కార్మికులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర గురించి పోరాట పటిమ గురించి అనేక మంది ప్రసంగించారు. కళాకారులు తమ పాటల ద్వారా అలరించారు. శిబిరంలో పాల్గొని ప్రసంగించిన వారిలో జిల్లా నాయకులు బైరాగోని యాదగిరి, నామాల శ్రీనివాసు, దూడల సిద్దయ్య, మెరుగు బాలరాజు, మార్క ఉపేందర్, తీగల సిద్దులు, అంబాల రఘునాథ్ గౌడ్, అంబాల ఆంజనేయులు గౌడ్, మనోజ్ కుమార్ గౌడ్ మారగోని సిద్ధయ్య గౌడ్, శ్రీనివాసు, తాల్లపల్లి శివరాం గౌడ్, బాల్దే వెంకట మల్లు, బూడిద గోపి, మేకపోతుల ఆంజనేయులు గౌడ్, పొరుగు జిల్లాల నాయకులు పల్సాం సోమన్న, జెక్కె వీరాస్వామి, ఉడుతల బాలకృష్ణ, మార సోమరాజు, పాల్సం వెంకన్న,గుండాల మల్లేశ్ గౌడ్, బబ్బురి భిక్షపతి, బత్తిని వారి పులి శివకుమార్ పంజాల నర్సయ్య, పొన్నాల నారాయణ, బుర్ర పరశురాములు, అయిలోని సుధాకర్, పొడిశాల వెంకన్న, తండ రమేష్, పాంజాల శ్రవణ్, బొనగాని యాదగిరి, రామ్మోహన్ గౌడ్, సుదగాని హరిశంకర్, ఉస్మానియా సాంబశివుడు, వంగ రేణుక, లతా గౌడ్, సతీశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సంకీర్ణ ప్రభుత్వాలతోనే ప్రజలకు రక్షణ

**వరంగల్ వాయిస్, కేయూ :** దేశంలోని విభిన్న జాతులు, కులాలు, మతాలు, బహుళ సంస్కృతి, సాంప్రదాయాలతో కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల హక్కులకు, ప్రజాస్వామ్యానికి రక్షణ కేవలం సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటు ద్వారానే సాధ్యమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ సెనేట్ హాల్ లో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'భారత సమాజంలో సంకీర్ణ ప్రభుత్వాలు, ప్రజాస్వామ్యం' అనే అంశంపై జాతీయ సెమినార్ ను కేయూ రాజానీతీ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ జాతీయ సదస్సులో హరగోపాల్ కీలకోపన్యాసం చేస్తూ నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజల జీవితాల్లో మెరుగైన మార్పులు తెచ్చి సమాజాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే రాజకీయ పార్టీల ప్రధాన కర్తవ్యంగా ఉండాలన్నారు.

చైతన్యవంతమైన ప్రజలు లేకపోతే ప్రజాస్వామ్య మనుగడ ప్రశ్నార్ధకంగా మారుతుందన్నారు. నేటి రాజకీయ పార్టీలు కార్పొరేట్ శక్తుల ధన ప్రలోభాలకు లోనై ఓటర్లను ప్రభావితం చేయటం ప్రజాస్వామ్య ఉనికికి ప్రమాదకరమన్నారు. 'ఒకే దేశం -ఒకే ఎన్నిక' భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన భారతీయ సమాజానికి నష్టకరమన్నారు. రాజకీయ పార్టీల మ్యానిఫెస్టోలు ఓటర్లను ఆకర్షించడానికి ఉపయోగపడుతున్నప్పటికి వాటి అమలులో మాత్రం చిత్తశుద్ధి లోపిస్తోదన్నారు.

ఈ కార్యక్రమంలో మరో ముఖ్యఅతిథి గుల్బర్గా యూనివర్సిటీ యాక్టింగ్ వీసీ ప్రొఫెసర్ జి.శ్రీరాములు మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలతో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉంటాయని, ప్రజల అవసరాల కనుగుణమైన పాలనా అందిస్తేనే ప్రాంతీయ ప్రభుత్వాలకు, సంకీర్ణ ప్రభుత్వాలకు మనుగడ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం, గౌరవ అతిథులుగా కేయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.మనోహర్, ముంబై యూనివర్సిటీ ప్రొఫెసర్ జోష్ జార్జ్, రాజనీతి శాస్త్ర విభాగం బీఓఎస్ డాక్టర్ జి.కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సంజీవ్, డాక్టర్ లలిత కుమారి, డాక్టర్ విజయ్, డాక్టర్ భాగ్యమ్మ, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com